జర్నలిస్టు ఇల్లు అక్రమంగా కూల్చివేత..

కలెక్టర్, అధికారులపై క్రిమినల్ కేసు

బుల్డోజర్ న్యాయం చెల్లదని నవంబర్‌లో సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, జనవరి 2: ఉత్తరప్రదేశ్‌లోని యోగి సర్కార్ ఎంచుకున్న 'బుల్డోజర్ న్యాయం'.. ఇప్పుడు అక్కడి అధికారుల మెడకు చుట్టుకుంది. ఓ జర్నలిస్ట్ ఇంటిని అక్రమంగా కూల్చేశారన్న కేసులో.. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఐఏఎస్ అధికారి, జిల్లా పోలీసులు, ఇంజినీర్లు సహా మొత్తం 26 మంది అధికారులపై క్రిమినల్ కేసు నమోదైంది. నేరపూరిత కుట్ర, నకిలీ పత్రాలు సృష్టించటం, చట్టాన్ని ఉల్లంఘించటం సహా మొత్తం 16 నేరాల్ని వారిపై మహారాజ్‌గంజ్ జిల్లా పోలీసులు నమోదు చేశారు. కూల్చివేతలకు ఆదేశాలిచ్చిన ఆనాటి జిల్లా కలెక్టర్ అమర్‌నాథ్ ఉపాధ్యాయ, అడిషనల్ కలెక్టర్ కుంజ్ బిహారీ అగర్వాల్, మహారాజ్‌గంజ్ మున్సిపల్ ఈవో రాజేశ్ జైశ్వాల్, ఎస్ఈ మనికాంత్ అగర్వాల్, ఇతర ఇంజినీర్లు, స్థానిక ఎస్ఐ, ఇతర అధికారులను నిందితులుగా ఎఫ్ఐఆర్ పేర్కొన్నది. సీనియర్ జర్నలిస్టు మనోజ్ తిబ్రేవాల్ ఆకాశ్‌కు చెందిన రెండంతస్తుల ఇల్లు అక్రమంగా కూల్చివేశారన్న ఘటనలో బాధ్యులపై చర్యలు చేపట్టాలంటూ సుప్రీం కోర్టు గత ఏడాది నవంబర్‌లో యూపీ ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. మనోజ్ తిబ్రేవాల్ ఆకాశ్‌కు రూ.25 లక్షలు నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నది. 'బుల్డోజర్ న్యాయం చెల్లుబాటు కాదు. ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు' అంటూ యోగి సర్కార్‌కు స్పష్టంచేసింది.

ఏం జరిగింది?

2019 సెప్టెంబర్ 13న మహారాజ్‌గంజ్ పట్టణంలోని జర్నలిస్టు తిబ్రేవాల్ ఇంటిని అధికారులు అక్రమంగా కూల్చివేయటం వివాదానికి దారితీసింది. లీగల్ నోటీసులు ఇవ్వకుండా, నష్టపరిహారం చెల్లించకుండా.. కొన్ని నిమిషాల వ్యవధిలో బుల్డోజర్‌తో ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఇంటితో పాటు, అందులోని మెడికల్ షాప్ కూడా పూర్తిగా ధ్వంసమైంది. నగదు, ఇతర విలువైన వస్తువులు తీసుకోనివ్వకుండా, తన తల్లిని, గర్భంతో ఉన్న వదినను పోలీసులు బలవంతంగా బయటకు పంపారని తిబ్రేవాల్ ఆరోపించారు. ఇంటి జాగాలో కేవలం 5 అడుగులు మాత్రమే రహదారి విస్తరణలో పోతుందని అధికారులు తొలుత చెప్పారని, ఒక్క రాత్రిలో ప్లాన్ అంతా మార్చేసి.. ఇంటినంతా కూల్చేశారని ఆయన పేర్కొన్నారు. రహదారి విస్తరణకు సంబంధించి అధికారులు అవినీతి, ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని, అందువల్లే ముందు అనుకున్న ప్లాన్ మారిందని చెప్పారు.

పిగ్ బుచరింగ్ స్కామ్‌తో జాగ్రత్త

- నిరుద్యోగులు, విద్యార్థులు, గృహిణులే లక్ష్యంగా మోసం
- ఫేస్‌బుక్, వాట్సాప్ వేదికగా సైబర్ కేటుగాళ్ల బురిడీ
- అప్రమత్తంగా ఉండాలి: కేంద్రం

న్యూఢిల్లీ: నిరుద్యోగులు, గృహిణులు, విద్యార్థులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు పిగ్ బుచరింగ్ స్కామ్ లేదా ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్‌కు పాల్పడుతున్నారని కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ఈ సైబర్ మోసానికి గత ఏడాది చాలా మంది బలయ్యారని తన వార్షిక నివేదికలో తెలిపింది. 2024 మొదటి త్రైమాసికంలో ఈ స్కామ్‌పై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. వాట్సాప్ ద్వారా 14,746, టెలిగ్రామ్ నుంచి 7651, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా 7152, ఫేస్‌బుక్ నుంచి 7051, యూట్యూబ్ ద్వారా 1135 మోసాలు జరిగినట్టు కేసులు నమోదయ్యాయి. 'గూగుల్ అడ్వర్టైజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్, ఫేస్‌బుక్ స్పాన్సర్ లింక్‌ల ద్వారా మోసపూరిత ప్రకటనలు ఇస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ కొత్త స్కామ్‌లో భారీగా మనీ లాండరింగ్‌తో పాటు సైబర్ బానిసత్వం కూడా భాగమైంది' అని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

ఏమిటీ 'పిగ్ బుచరింగ్ స్కామ్'?

2016లో చైనాలో ఈ స్కామ్ ప్రారంభమైనట్టు భావిస్తారు. సైబర్ నేరగాళ్లు ముందుగా ఫేస్‌బుక్, వాట్సాప్, గూగుల్ వంటి వేదికల ద్వారా ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తారు. భారీగా లాభాలు వస్తాయనే ఆశలు కల్పించి క్రిప్టో కరెన్సీ, ఇతర నకిలీ పెట్టుబడి పథకాల్లో పెట్టుబడులు పెట్టిస్తారు. కొన్ని రోజుల పాటు లాభాలు ఎరగా వేస్తారు. లాభాలు వస్తున్నాయని నమ్మి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిన తర్వాత ముంచేస్తారు. పందులకు బాగా దాణా వేసి, లావెక్కిన తర్వాత వధించే వ్యక్తి తీరులా ఈ మోసాలు ఉంటాయని దీనిని 'పిగ్ బుచరింగ్ స్కామ్' అని పిలుస్తున్నారు.

రొమ్ము క్యాన్సర్‌కు హైడ్రోజెల్ చికిత్స

- అభివృద్ధి చేసిన ఐఐటీ గువాహటి
- దుష్ప్రభావాలు తక్కువని వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 2: రొమ్ము క్యాన్సర్ చికిత్సలో ఐఐటీ గువాహటి పరిశోధకులు పురోగతి సాధించారు. ఇంజెక్ట్ చేయగల హైడ్రోజెల్‌ను వారు ఆవిష్కరించారు. సంప్రదాయ క్యాన్సర్ చికిత్సలతో పోలిస్తే దీని వల్ల చాలా తక్కువ సైడ్‌ఎఫెక్ట్స్ ఉండటం విశేషం. కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి ఐఐటీ గువాహటి పరిశోధకులు ఈ హైడ్రోజెల్‌ను అభివృద్ధి చేశారు. అధికారిక వర్గాలను ఉటంకిస్తూ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన మెటీరియల్ హారిజోన్స్ జర్నల్‌లో ఈ మేరకు కథనం ప్రచురితమైంది.

క్యాన్సర్ నిరోధక డ్రగ్స్‌కు రిజర్వాయర్

నీటి ఆధారిత త్రీ డైమెన్షనల్ నెట్‌వర్క్‌లనే హైడ్రోజెల్‌గా పిలుస్తున్నారు. ఫ్లూయిడ్స్‌లను గ్రహించి, అందులో నిలుపుకొనే సామర్థ్యం వీటికి ఉంటుంది. వీటి ప్రత్యేక నిర్మాణం జీవకణాలను అనుకరించేందుకు ఉపకరిస్తాయి. ప్రధానంగా క్యాన్సర్ నిరోధక డ్రగ్స్‌కు రిజర్వాయర్‌లా ఈ హైడ్రోజెల్ దోహదపడుతుంది. అంతేకాదు, అవసరమైన సమయంలో ఒక పద్ధతి ప్రకారం క్యాన్సర్ నిరోధక డ్రగ్స్‌ను విడుదల చేసి చికిత్స చేస్తుంది.

నేరుగా క్యాన్సర్ కణాలకు చికిత్స

'క్యాన్సర్ కణతులను శస్త్రచికిత్స ద్వారా తొలగించడం కొన్నిసార్లు సాధ్యపడదు. ముఖ్యంగా అంతర్గత అవయవాలకు చికిత్స చేసేటప్పుడు సమస్య ఎదురవుతుంది. కీమోథెరపీ చేస్తే క్యాన్సర్ కణాలతో పాటు ఆరోగ్యకరమైన కణాలపై కూడా ప్రభావం పడుతుంది. కానీ, ఈ హైడ్రోజెల్ ద్వారా నేరుగా క్యాన్సర్ కణాలకు చికిత్స చేసేందుకు ఆస్కారం ఉంటుంది' అని పరిశోధనలకు నేతృత్వం వహించిన ఐఐటీ గువాహటి ప్రొఫెసర్ దేబప్రతీమ్ దాస్ తెలిపారు.

బస్సు చార్జీల బాదుడు

15% పెంచిన కర్ణాటక కాంగ్రెస్ సర్కారు

- 'ఉచిత బస్సు' భారాన్ని తగ్గించుకునే ప్రణాళిక
- శక్తి పథకంతో దివాలా తీస్తున్న రాష్ట్ర ఆర్టీసీలు
- 1,694 కోట్లు బకాయి పడ్డ సిద్ధూ ప్రభుత్వం
- బకాయిలు చెల్లించలేక చార్జీల పెంపునకు సిద్ధం!

బెంగళూరు, జనవరి 2: కర్ణాటక ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం మరో భారం మోపింది. ఆర్టీసీ బస్సు చార్జీలను 15 శాతం పెంచుతూ సిద్ధరామయ్య సర్కారు గురువారం నిర్ణయం తీసుకుంది. శక్తి పథకం పేరుతో అమలు చేస్తున్న ఉచిత బస్సు భారాన్ని తగ్గించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన కర్ణాటక స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(కేఎస్ఆర్టీసీ), నార్త్ వెస్ట్ కర్ణాటక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(కేడబ్ల్యూకేఆర్టీసీ), కల్యాణ కర్ణాటక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(కేకేఆర్టీసీ), బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(బీఎంటీసీ)ల్లో బస్సు టికెట్ల చార్జీలను పెంచుతున్నట్టు మంత్రి హెచ్‌కే పాటిల్ ప్రకటించారు. నిర్వహణ ఖర్చులు, డీజిల్ ధరలు పెరగడం వల్లే చార్జీలు పెంచినట్టు ఆయన పేర్కొన్నారు.

ఉచిత బస్సు భారమే కారణమా?

2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మహిళలను ఆకర్షించడానికి కాంగ్రెస్ పార్టీ 'శక్తి' పేరుతో గ్యారెంటీని ప్రకటించింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చింది. 2023 జూన్ నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తున్నది. అయితే, ఈ పథకం రాష్ట్ర ఖజానాకు భారంగా మారింది. నవంబర్ నాటికి నాలుగు ఆర్టీసీలకు ప్రభుత్వం రూ.1,694 కోట్లు బకాయి పడింది. ఆర్టీసీలు జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి చేరుకున్నాయి.దీంతో ఉచిత బస్సు భారాన్ని తగ్గించుకునేందుకు, ప్రభుత్వ బకాయిలతో దివాలా తీస్తున్న ఆర్టీసీని గాడిన పెట్టేందుకు ప్రభుత్వం టికెట్ ధరల పెంచుతున్నదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

పథకాన్ని ఎత్తేసేందుకూ ప్రయత్నాలు

ఉచిత బస్సు పథకం ప్రభుత్వానికి గుదిబండలా మారడంతో ఎత్తేసేందుకూ ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలోనే మహిళలు టికెట్లు కొంటామని చెప్తున్నారని, పథకంపై సమీక్షిస్తామని అక్టోబరులో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ఈ పథకాన్ని నిలిపేస్తారా అనే విమర్శలురావడంతో ప్రభుత్వ ప్రయత్నాలు వికటించాయి. దీంతో ఇప్పుడు టికెట్ల రేట్ల పెంపుతో భారాన్ని కొంత తగ్గించుకుంటున్నది.



సబ్సిడీలకు మంగళం!

రాయితీలకు హిమాచల్ కాంగ్రెస్ సర్కారు కోత

- 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ
- ఇప్పటివరకు హామీని అమలు చేయకపోగా, ఇప్పుడు ఇస్తున్న సబ్సిడీనీ ఎత్తివేసే యత్నం

సిమ్లా, జనవరి 2: గ్యారెంటీల పేరుతో హిమాచల్ ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పథకాలు అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. ఎన్నికల్లో గెలిస్తే ఖటాఖట్ పథకాలు అమలు చేస్తామని చెప్పిన ఆ పార్టీ ఇప్పుడు పథకాల గుదిబండను మోయలేక కత్తెర్లు పెడుతున్నది. తాజాగా విద్యుత్తు సబ్సిడీలపై కాంగ్రెస్ సర్కారు కన్ను పడింది. హిమాచల్ ప్రదేశ్‌లో 125 యూనిట్ల వరకు విద్యుత్తు సబ్సిడీ ఇచ్చే పథకం అమలవుతున్నది. తాము అధికారంలోకి వస్తే 300 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. 2022లో అధికారం చేపట్టిన ఆ పార్టీ ఇప్పటివరకు ఈ పథకాన్ని అమలు చేయలేదు. పైగా ఇప్పుడు 125 యూనిట్లకు ఇస్తున్న సబ్సిడీని సైతం ఎత్తేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది.

సబ్సిడీ వదులుకోవాలంటూ వేడుకోలు

సంపన్నులు, పన్ను చెల్లింపుదారుల పేరుతో సబ్సిడీలను తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగా తన పేరిట ఉన్న ఐదు విద్యుత్తు కనెక్షన్ల సబ్సిడీలను వదులుకుంటున్నట్టు ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు ప్రకటించారు. సంపన్నులు సైతం సబ్సిడీలు వదులుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ చర్యలపై ఇప్పుడు ప్రతిపక్ష బీజేపీ మండిపడుతున్నది. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు హామీ ఇస్తామని చెప్పి ఇప్పుడు ఉన్న సబ్సిడీనే ఎత్తేసేందుకు కాంగ్రెస్ సర్కారు ఈ ఎత్తుగడ వేసిందని ఆరోపిస్తున్నది. హిమాచల్ ప్రదేశ్‌లో హోటళ్లు, పెద్ద వాణిజ్య సంస్థలకు ప్రస్తుతం అందుతున్న వివిధ సబ్సిడీలను ప్రభుత్వం గుర్తించింది. వీటిని సైతం ఎత్తేయాలని నిర్ణయించింది.

హిమాచల్‌ను దివాలా తీయించిన కాంగ్రెస్

10 గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్‌ను దివాలా తీయించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల వేతనాలు సైతం సమయానికి ఇవ్వలేని స్థితికి ప్రభుత్వం చేరుకుం ది. కేంద్రం నుంచి ప్రతినెలా నిధులు వచ్చే వరకు వేతనాలు ఇవ్వలేమని చెప్పిన సీఎం సుఖు.. 1లోపే చెల్లించాల్సిన జీతాలను 5న, పింఛన్లు 10వ తేదీన చెల్లిస్తామని ప్రకటించడం రాష్ట్ర ఆర్థిక స్థితికి అద్దం పడుతున్నది.

అమెరికాలో ఉగ్ర కలకలం!

- 24 గంటల వ్యవధిలోనే 3 దాడులు
- 16 మంది మృతి.. 50 మందికి గాయాలు
- లాస్ వెగాస్ ట్రంప్ హోటల్ ముందు పేలుడు
- ఏడుగురికి గాయాలు.. నిందితుడి మృతి
- న్యూయార్క్ నైట్‌క్లబ్ ముందు కాల్పులు
- 12 మందికి తీవ్రగాయాలు
- దాడులు ఉగ్రవాదుల పనేనా?

న్యూయార్క్, జనవరి 2: కొత్త సంవత్సర వేడుకల వేళ వరుస దాడులతో అమెరికాలో భయాందోళనలు నెలకొన్నాయి. 24 గంటల వ్యవధిలో మూడు దాడులు జరగడం, దాడులన్నీ ఉగ్రవాద చర్యలనే అనుమానాలతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. మూడు దాడుల్లో 16 మంది మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం న్యూఓర్లీన్స్ నగరంలో న్యూ ఇయర్ వేడుకల్లో మొదటి దాడి జరగగా, కొన్ని గంటల వ్యవధిలోనే లాస్ వెగాస్‌లోని ట్రంప్ టవర్ సమీపంలో పేలుడు సంభవించింది. బుధవారం రాత్రి న్యూయార్క్‌లోని ఓ నైట్ క్లబ్ ముందు మూడో దాడి చోటు చేసుకున్నది. మరోవైపు న్యూఓర్లీన్స్‌లో దాడికి తెగబడ్డ వ్యక్తి ఐసిస్ ఉగ్రవాద సంస్థతో ప్రేరేపితమయ్యాడని పోలీసులు గుర్తించారు. దీంతో మిగతా రెండు దాడులు కూడా ఒక ప్రణాళిక ప్రకారం, సమన్వయంతో జరిగాయా అనే దిశగా దర్యాప్తు జరుగుతున్నది.

ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్ ముందు జరిగిన పేలుడులో కాలిపోతున్న కారు

ట్రంప్ హోటల్ సమీపంలో పేలుడు

లాస్ వెగాస్‌లోని ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్ పార్కింగ్ స్థలంలో బుధవారం పేలుడు సంభవించింది. పేలుడు పదార్థాలతో నిండి ఉన్న టెస్లా సైబర్ ట్రక్‌లో పేలుడు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. ఈ హోటల్ అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందినది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న ఓ వ్యక్తి మరణించగా, సమీపంలో ఉన్న మరో ఏడుగురికి గాయాలైనట్టు లాస్ వెగాస్ మెట్రోపాలిటన్ పోలీసులు తెలిపారు. ఈ పేలుడు ఉగ్రవాద చర్య అని, మృతుడే నిందితుడని పోలీసులు భావిస్తున్నారు. ఈ ట్రక్కును అద్దెకు తీసుకున్న కొలరాడో స్ప్రింగ్స్‌లో ఎఫ్‌బీఐ సోదాలు జరుపుతున్నది. దాడికి పాల్పడిన నిందితుడి పేరు అధికారికంగా ప్రకటించలేదు.

న్యూయార్క్ నైట్‌క్లబ్‌లో కాల్పులు

న్యూయార్క్‌లోని క్వీన్స్‌లో మూడో దాడి జరిగింది. బుధవారం రాత్రి ఒక నైట్ క్లబ్ బయట నిలబడ్డ వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని కొందరు దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ముగ్గురు లేదా నలుగురు వ్యక్తులు దాదాపు 30 సార్లు కాల్పులు జరిపినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కాల్పుల తర్వాత నిందితులు కారులో పారిపోయినట్టు తెలిపారు.

సైన్యంలో పని చేసిన నిందితుడు

న్యూ ఓర్లీన్స్ దాడి నిందితుడు 2005-20 మధ్యకాలంలో అమెరికా సైన్యంలో హెచ్‌ఆర్, ఇన్ఫర్మేషన్ మేనేజర్‌గా పని చేశాడు. యువకుడిగా ఉన్నప్పుడు అతడు ఇస్లాంలోకి మారాడని అధికారులు అనుమానిస్తున్నారు. అద్దె ఇంట్లో అతడు పేలుడు పదార్థాలను తయారుచేసినట్టు గుర్తించారు. అతడు ఐసిస్ లోన్ ఉల్ఫ్(ఉగ్రవాద సంస్థతో ప్రేరేపితమై ఒంటరిగా పని చేసే వ్యక్తి)గా భావిస్తున్నారు.

న్యూ ఓర్లీన్స్ దాడి ఉగ్రవాద ప్రేరేపిత చర్య!

మరోవైపు న్యూ ఓర్లీన్స్‌లో కొత్త సంవత్సర వేడుకల్లో జరిగిన దాడి ఉగ్రవాద ప్రేరేపిత చర్యగా ఎఫ్‌బీఐ అనుమానిస్తున్నది. ఈ ఘటనలో నిందితుడిని షంషుద్దీన్ జబ్బర్‌గా గుర్తించారు. అతడే ఫోర్డ్ ఎఫ్-150 ట్రక్కును అద్దెకు తీసుకొని దాడికి తెగబడ్డాడని తేలింది. ఈ దాడిని ఉగ్రవాద చర్యగా భావించి విచారణ జరుపుతున్నామని, ఎక్కువమందిని హతమార్చాలనే లక్ష్యంతోనే నిందితుడి ప్రవర్తన ఉందని ఎఫ్‌బీఐ తెలిపింది. దాడికి ఉపయోగించిన ట్రక్కులో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాద సంస్థ జెండా లభించినట్టు వెల్లడించింది. దాడి అనంతరం పోలీసుల కాల్పుల్లో నిందితుడు జబ్బర్ మరణించిన సంగతి తెలిసిందే. ఘటనాస్థలం నుంచి ఇంట్లో తయారు చేసిన పైప్‌బాంబులు, గ్రెనేడ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాడి తీరును బట్టి ఒంటరిగా చేసినది కాకపోవచ్చని ఎఫ్‌బీఐ అనుమానిస్తున్నది.

ఓపీటీ వద్దే వద్దు!

- హెచ్1బీ వీసాకు అదో సాధనంగా మారింది
- దీంతో అసలైన అమెరికన్లకు జాబ్స్ రావట్లే
- ట్రంప్ వర్గంలోని మాగా నేటివిస్టుల ఆరోపణ
- హెచ్-1బీకి మద్దతిస్తున్న మరోవర్గం 'డీఓజీఈ'
- ఓపీటీ రద్దుతో భారత విద్యార్థులపై ప్రభావం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని కంపెనీల్లో కీలక పదవుల్లో విదేశీ ఉద్యోగులను నియమించుకొనేందుకు అనుమతించే హెచ్-1బీ వీసాలపై అగ్రరాజ్యంలో పెద్దయెత్తున చర్చ జరుగుతున్నది. జనవరి 20న రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హెచ్-1బీ వీసా విధానంలో పలు కీలక సంస్కరణలు తీసుకురానున్నారు. ఈ క్రమంలో హెచ్-1బీ వీసాల జారీపై ట్రంప్ పార్టీలోని నేతలే రెండువర్గాలుగా చీలి తమ డిమాండ్లను బహిరంగంగానే వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

ఓపీటీపై గరం

హెచ్-1బీ వీసాల పేరిట కొత్తగా విదేశీ ఉద్యోగులను ఇక్కడకు తీసుకురావాల్సిన అవసరం లేదని ట్రంప్ క్యాంపునకు చెందిన మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) నేటివిస్టులు చెప్తున్నారు. ఈ క్రమంలో అమెరికాలో పని అనుభవాన్ని పొందడానికి విదేశీ విద్యార్థులను అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రాంలో ఉన్న లొసుగులను ఎత్తిచూపుతున్నారు. ఓపీటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏమిటీ ఓపీటీ? దాంతో ఏం జరుగుతుంది??

అమెరికాలో వృత్తిపరమైన అనుభవం కోసం విదేశీ విద్యార్థులు ఎఫ్-1 వీసాలపై అందుకునే శిక్షణను ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)గా చెప్తున్నారు. 1947లో ప్రారంభించిన ఈ ఓపీటీ ప్రోగ్రామ్ సాయంతో విదేశీ విద్యార్థులు మొదటి విద్యా సంవత్సరం తర్వాత ఏడాదిపాటు ఓపీటీలో కొనసాగవచ్చు. ఈ సమయంలో తాత్కాలికంగా ఉద్యోగాలూ చేయవచ్చు. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేట్ చేసిన వారు డిగ్రీ పూర్తయ్యాక మూడేండ్ల వరకూ అమెరికాలో ఉండి ఓపీటీ ద్వారా పని అనుభవం పొందే వీలు ఉంటుంది. ఇదే సమయంలో ఉద్యోగమూ చేయవచ్చు. దీంతో ఓపీటీ పేరిట అమెరికాకు వచ్చిన విదేశీ విద్యార్థులు ఇక్కడ ఉద్యోగంలో చేరడంతో పాటు హెచ్-1బీ వీసా పొందడానికి దీన్ని ఒక సాధనంగా మార్చుకొంటున్నారని మాగా నేటివిస్టులు ఆరోపిస్తున్నారు. ఓపీటీ ప్రోగ్రాం వ్యవధి ముగిసేలోగా హెచ్-1బీ వీసాలకు మారడం, గ్రీన్ కార్డులకు దరఖాస్తు చేస్తూ ఇక్కడే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకొంటున్నారని ఆరోపిస్తున్నారు.

'ఓపీటీ' ప్రోగ్రామ్‌కు భారత విద్యార్థుల దరఖాస్తులు ఇలా..

సంవత్సరం	దరఖాస్తులు
2022-23	69,061
2023-24	97,556

మరోవర్గం వాదనేంటంటే?

నైపుణ్యం కలిగిన ఉద్యోగులు ఎక్కడున్నా.. వారిని ప్రోత్సహించాల్సిందేనని ట్రంప్ కార్యవర్గంలోని మరో గ్రూప్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డీఓజీఈ) నేతలు చెప్తున్నారు. ఈ జాబితాలో ట్రంప్ సలహాదారులుగా వ్యవహరిస్తున్న ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి తదితరులు ఉన్నారు. ఓపీటీ విధానంతో వచ్చిన ఇబ్బందేమీ లేదన్నారు. విదేశీ ఉద్యోగులను నియమించుకోవడానికి హెచ్-1బీ వీసా విధానాన్ని మరింత బలోపేతం చేయాలని సూచిస్తున్నారు. ఇదిలాఉండగా.. ఓపీటీ ప్రోగ్రామ్‌ను రద్దు చేసినా, హెచ్-1బీ వీసాల్లో కోత విధించినా భారత్, చైనాలోని టెకీలకు, విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని నిపుణులు చెప్తున్నారు.

ఆసియాలో వరస్ట్ ట్రాఫిక్ నగరాల్లో బెంగళూరు టాప్

బెంగళూరు: ఆసియాలో వరస్ట్ ట్రాఫిక్ ఉన్న నగరాల్లో బెంగళూరు టాప్‌లో నిలిచింది. నగరంలో 10 కిలోమీటర్ల ప్రయాణానికి డ్రైవర్లు సగటున 28 నిమిషాల 10 సెకండ్ల సమయాన్ని వెచ్చిస్తున్నారని టామ్ టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం బెంగళూరులో పౌరులు ట్రాఫిక్ రద్దీలో చిక్కుకుపోవడం వల్ల ఏడాదికి 132 గంటల సమయాన్ని అదనంగా వెచ్చించాల్సి వస్తున్నది. ఆసియాలో బెంగళూరు తర్వాత మహారాష్ట్రలోని పుణె నిలిచింది. ఇక్కడ 10 కి.మీ ప్రయాణానికి సగటు సమయం 27 నిమిషాల 50 సెకన్లు పడుతున్నది.

నెత్తిపై రోదసి పిడుగు!

- మానవాళికి పెనుముప్పుగా అంతరిక్ష వ్యర్థాలు
- కెన్యాలోని ఓ గ్రామంపై 500 కిలోల మెటల్
- 'కెస్లర్ సిండ్రోమ్'కు ఆరంభమే: పరిశోధకులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ముకుకు అనేది కెన్యా దేశంలో ఉత్తర ప్రాంతంలోని ఓ కుగ్రామం. గత సోమవారం అక్కడి ప్రజలు.. నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకడానికి ఎంతో ఉత్సాహంగా సంబురాలకు సిద్ధమయ్యారు. ఇంతలో ఆకాశం నుంచి ఏదో ఉన్నట్టుండి పడ్డట్టు పెద్ద శబ్దం వచ్చింది. ఊరి శివారు ప్రాంతంలో అది పడ్డట్టు గమనించిన గ్రామస్థులు.. ఏమిటా? అని అక్కడికి చేరుకొన్నారు. చూస్తే, ఓ పెద్ద ఇనుప ప్లేటు వారికి కనిపించింది. విషయాన్ని అధికారులకు చేరవేశారు. అక్కడికి చేరుకొన్న కెన్యా స్పేస్ ఏజెన్సీ (కేఎస్‌ఏ) పరిశోధకులు.. భూ దిగువ కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఓ వాహకనౌకకు చెందిన మెటల్ భాగం ఆకాశం నుంచి కిందికి పడినట్టు వెల్లడించారు. మెటల్ బరువు 500 కిలోల వరకు ఉన్నట్టు తెలిపారు. అదివిన్న గ్రామస్థుల గుండెలు గుభేలుమన్నాయి. అంత బరువైన మెటల్ నెత్తిమీద పడితే తమ పరిస్థితి ఏమయ్యేదని ఆందోళన చెందారు. భూ దిగువ కక్ష్యలో అంతకంతకూ పెరిగిపోతున్న అంతరిక్ష వ్యర్థాలతో ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి పరిస్థితి రావొచ్చని పరిశోధకులు కూడా హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనను 'కెస్లర్ సిండ్రోమ్'కు ఆరంభంగా అభివర్ణిస్తున్నారు.

ఏమిటీ కెస్లర్ సిండ్రోమ్?

భూ ఉపరితలం నుంచి 2 వేల కిలోమీటర్ల ఎత్తులో భూ దిగువ కక్ష్య ఉంటుంది. రోదసి ప్రయోగాల అనంతరం నిరుపయోగంగా మారిన వాహకనౌకలు, ఉపగ్రహ వ్యర్థాలన్నీ అక్కడే తిరుగుతాయి. ఆ కక్ష్యలో వ్యర్థాల సాంద్రత పరిమితికి మించి పెరిగినప్పుడు ఆయా శకలాల మధ్య చైన్ రియాక్షన్ జరుగుతుంది. దీంతో ఆ శకలాలు ఒకదానికొకటి ఢీకొని భూమి మీద పడతాయి. ఈ స్థితిలో రోదసి ప్రయోగాలకు భూ దిగువ కక్ష్య పనికి రాదు. దీన్నే కెస్లర్ సిండ్రోమ్‌గా పిలుస్తారు. కెన్యాలో జరిగిన ప్రమాదం 'కెస్లర్ సిండ్రోమ్'కు ఆరంభంగా పలువురు చెప్తున్నారు.

ముకుకు గ్రామం(కెన్యా)లో పడిన అంతరిక్ష వ్యర్థాన్ని పరిశీలిస్తున్న గ్రామస్థులు

ప్రమాదాలు కొత్తేం కాదు

గతంలో ఓ పనిచేయని ఉపగ్రహానికి చెందిన విడిభాగం తమ ఇంటిమీద పడిందని ఫ్లోరిడాకు చెందిన ఓ కుటుంబం గత ఏడాది నాసాపై దావా వేసింది. 3,200 కిలోల బరువున్న ఓ పనిచేయని ఉపగ్రహం అలస్కా-హవాయి మధ్యనున్న పసిఫిక్ మహాసముద్రంలో పడిపోయినట్టు గత ఫిబ్రవరిలో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ప్రకటించింది. కాగా, అంతరిక్ష వ్యర్థాల కారణంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) ఇప్పటికే రెండుసార్లు ప్రమాదం ఎదురైంది.

6 వేల టన్నుల వ్యర్థాలు

ప్రస్తుతం భూ దిగువ కక్ష్యలో కాలం చెల్లిన శాటిలైట్లు, రాకెట్ల విడిభాగాలు, శిథిలాలతో కలుపుకొని మొత్తం 6 వేల టన్నుల బరువు గల వ్యర్థాలు తిరుగుతున్నాయి. ఈ అంతరిక్ష వ్యర్థాలు గంటకు సుమారు 18,000 మైళ్ల వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదకరంగా మారాయి. ఈ వేగం బుల్లెట్ స్పీడ్ కంటే ఏడు రెట్లు ఎక్కువ. ఇంత వేగంతో ఈ వ్యర్థాలు భూమిమీద పడితే, సమస్త జీవజాలం అంతరించిపోవొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యర్థాలను తొలగించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్తున్నారు.